ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 18.06.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. పర్యావరణహిత, కాగిత రహిత విధానాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాలను ఇకపై పూర్తిగా పేపర్ లెస్ గా నిర్వహించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

2. రాష్ట్రంలో పచ్చదనం పెంపు , పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టనున్న వన మహోత్సవం-2026 ఈరోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమవుతుంది.

3. మందుల సరఫరా వ్యవస్థ బలోపేతానికి క్యూర్ ప్రాంతంలో మరో నాలుగు కొత్త సి.ఎం.ఎస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

4. నైరుతి రుతుపవనాలు హైదరాబాద్ , భద్రాచలం, కోరాపుట్, రాంచీ, ముజఫర్‌పుర్ వరకూ విస్తరించాయని వాతావరణ శాఖ తెలిపింది.

**మంత్రి వర్గ సమావేశం**

పాలనలో పారదర్శకత , వేగం పెంచడంతో పాటు పర్యావరణహిత కాగిత రహిత విధానాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాష్ట్ర మంత్రి వర్గ సమావేశాలను ఇకపై పూర్తిగా పేపర్ లెస్ గా నిర్వహించాలని ప్రభఉత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల ప్రత్యేక సమావేశంలో ఈ తెలంగాణ డిజిటల్ క్యాబినెట్ నిర్వహణకు అధికారిక ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి సహా మంత్రులందరికీ ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారు. ఇకపై మంత్రి వర్గ సమావేశాల ఎజెండాను మంత్రులకు డిజిటల్ పద్ధతిలో 'ఈ-బుక్' ద్వారానే సరఫరా చేయనుండగా, ఈ సరికొత్త డిజిటల్ క్యాబినెట్ అమలు తీరును ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు.

డెస్క్

**వన మహోత్సవం**

రాష్ట్రంలో పచ్చదనం పెంపు , పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా చేపట్టనున్న వన మహోత్సవం-2026ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ అటవీ ప్రాంతంలో ఈ రోజు సాయంత్రం ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నాగలింగం మొక్కను , మంత్రి కొండా సురేఖ నేరేడు మొక్కను నాటుతారని అటవీశాఖ తెలియజేసింది. వన మహోత్సవాన్ని ప్రారంభించిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 35కోట్ల రూపాయల పైచిలుకు వ్యయంతో వివిధ ప్రాంతాల్లో చేపట్టనున్న అటవీ , ఎకో

టూరిజం మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేయడంతో పాటు పలు ప్రారంభోత్సవాలు చేస్తారని అటవీశాఖ వెల్లడించింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి ఒక పోస్ట్ చేశారు. ఇది కేవలం మొక్కలు నాటే కార్యక్రమం కాదని , గతంలో వరదల వల్ల జరిగిన విధ్వంసకర పరిస్థితుల నుంచి తీసుకున్న సంకల్పానికి ప్రతీక అని తెలిపారు. చెరువుల పరిరక్షణ, నాలాల పునరుద్ధరణ , అటవీ భూముల రక్షణ ద్వారా హైదరాబాద్‌ను పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

పీటీసీ, హైదరాబాద్

**సీతక్క**

ఖమ్మం జిల్లాలో లైంగిక దాడికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక తల్లిదండ్రులను మహిళా , శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క , రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి జస్టిస్ పంచాక్షరి పరామర్శించి ధైర్యం చెప్పారు. బాలిక ఆరోగ్య పరిస్థితి , అందిస్తున్న చికిత్స గురించి వైద్యులు వారికి వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయ చెక్కును బాలిక కుటుంబానికి మంత్రి సీతక్క , జస్టిస్ పంచాక్షరి అందజేశారు.

డెస్క్

**భట్టి**

వ్యవసాయం లాభదాయకం కావాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని.. పేదలు సన్నబియ్యం తినాలని.. జాతీయంగా , అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న 7 మేలుజాతి సన్న రకాల సాగును ప్రజాప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. వీటిద్వారా వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత ముందుకు వెళుతుందని వివరించారు.

డెస్క్

**దామోదర**

మందుల సరఫరా వ్యవస్థ బలోపేతానికి క్యూర్ ప్రాంతంలో మరో నాలుగు కొత్త సి.ఎం.ఎస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య , ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. హిమోఫిలియా బాధితులకు అవసరమైన మందులను ఉచితంగా అందించాలని , ఎమిసిజుమాట్ ఔషధాన్ని ఖమ్మం , వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా అందుబాటులోకి తేవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ పనితీరుపై మంత్రి నిన్న ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

డెస్క్

**ట్రస్ట్**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు , పెన్షనర్లకు ఆరోగ్య పథకాన్ని అమలు చేసే లక్ష్యంతో ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నిన్న జీవో నెంబర్ 40 జారీ చేశారు. మొత్తం 30

మందితో బోర్డును ఏర్పాటు చేశారు. ఛైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , మెంబర్ సెక్రటరీగా ఉద్యోగుల ఆరోగ్య పథకం సీఈవో వ్యవహరిస్తారు. మిగిలిన 28 మంది సభ్యులుగా ఉంటారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవోనే ప్రస్తుతానికి ఈహెచ్ఎస్ పూర్తిస్థాయి ఇన్‌ఛార్జి సీఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

డెస్క్

**నషాముక్త్ భారత్ బైట్**

నషాముక్త్ భారత్ లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో జోనల్ డైరెక్టర్ పి. యశ్వంత్ చెప్పారు. ఈరోజు ప్రత్యేకంగా ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ...

బైట్ ... యశ్వంత్

డెస్క్

**యూనివర్సిటీ**

డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్‌తో పాటు పలు విదేశీ భాషల్లో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి తెలిపారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్. విజయకృష్ణారెడ్డి , ముంబైకి చెందిన ఇగ్నిటస్ ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మీటాసింగ్ కన్వర్ అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని, విదేశీ భాషలపై ప్రావీణ్యం ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పేర్కొన్నారు.

డెస్క్

**కొప్పుల ఈశ్వర్**

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంక్షేమం కోస మే పనిచేస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కరీంనగర్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... గడిచిన 30 నెలల కాలంలో అనేక కుంభకో ణాలు జరిగా యన్నారు. ఎస్సీ, ఎస్టీ బిసి సంక్షేమానికి సంబందించిన టెండర్లలో 200 కోట్లకు పైగా అవినీతి జరిగిందని విమర్శించారు.

పీటీసీ, కరీంనగర్

**యూరియా అమ్మకాలు**

రెండు రోజుల్లో యూరియా యాప్ ద్వారా అమ్మకాలు ప్రారంభమవుతాయని , రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం అన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు. యాప్ వినియోగం, ఎరువుల కొనుగోలుపై రైతులకు సందేహా లుంటే 18001237157 టోల్ ఫ్రీ నంబర్ ను సంప్రదించాలని సూచించారు.

పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**కాలినడకన కోర్టుకు జడ్జి**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపు మేరకు ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జక్కుల అనంతలక్ష్మి కాలినడకన కోర్టుకు

వెళ్లారు. రోజు రోజుకు పెరుగుతున్న కాలుష్యం, ఇంధన కొరతను తగ్గించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు.

పీటీసీ, ఆసిఫాబాద్

**రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్**

రాజన్న సిరిసిల్ల  జిల్లాలో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో పాటు  రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు.  జిల్లా పౌరసరఫరాల శాఖల అధికారులతో పాటు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**రుతు పవనాలు**

నైరుతి రుతుపవనాలు హైదరాబాద్ , భద్రాచలం, కోరాపుట్, రాంచీ, ముజఫర్పూర్ వరకూ విస్తరించాయని వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే నాలుగైదు రోజుల్లో మధ్య అరేబియా సముద్రం  ,  తెలంగాణ,  ఒడిశా,  ఝార్ఖండ్,  బిహార్ రాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాలకు ఇవి విస్తరించేందుకు అనుకూల పరిస్థితులున్నట్లు వివరించింది. ఈరోజు ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయి.

డెస్క్

**జాతీయ లోక్ అదాలత్**

ఈనెల 20న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు , సివిల్ వివాదాలు , ఆస్తి విభజన , కుటుంబ, వైవాహిక కేసులు , బ్యాంకు బకాయిల వసూళ్లు , విద్యుత్ చౌర్యం , చెక్ బౌన్స్ కేసులు వంటి అంశాల్లో ఇరుపక్షాలు చర్చించుకొని లోక్ అదాలత్ ద్వారా రాజీకి రావచ్చన్నారు.

పీటీసీ, పెద్దపల్లి

**నల్లగొండ జిల్లా కలెక్టర్**

అటవీ, రెవెన్యూ భూముల సమస్యలను త్వరగా పరిష్కరించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పీటీసీ నల్లగొండ

**సమాచార కమిషనర్**

సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వ శాఖలు అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి ఆదేశించారు. మంచిర్యాల కలెక్టరేట్ లో రాష్ట్ర సమాచార కమిషనర్లు, జిల్లా కలెక్టర్ కుమార్

దీపక్  తో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు సమాచార హక్కు చట్టం 2005 అమలుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పీటీసీ, మంచిర్యాల

**IIT HYDERABAD**

ఐఐటీ  హైదరాబాద్  క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్     2027లో సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది  664వ స్థానంలో ఉన్న ఈ సంస్థ, ఇప్పుడు 588వ గ్లోబల్ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది.

పీటీసీ, సంగారెడ్డి

**ఎస్ఐఆర్ - 2కే రన్**

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు.    ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు ఈరోజు నిర్వహించిన 2కె రన్‌ను ప్రారంభించారు.

పీటీసీ, వరంగల్

**త్రివేణీ ఎకో పార్క్**

పర్యాటకంలో అడవి అందాలను వీక్షించాల      నుకునే   పర్యాటకులను ఆకర్షించే విధంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో త్రివేణీ ఎకో పార్క్ ను ముఖ్యమంత్రి

రేవంత్ రెడ్డి ఈరోజు సాయంత్రం వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. 200 ఎకరాల్లో అటవీశాఖ ఈ ఎకో పార్కును ఏర్పాటు చేసింది.

పీటీసీ, సంగారెడ్డి

**ప్లాస్టిక్ రహిత మార్కెట్**

పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి , మార్కెట్లను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని వరంగల్ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు.

పీటీసీ, వరంగల్

**పానీపూరి**

రాజన్న సిరిసిల్ల జిల్లా , కేసీఆర్ నగర్ కాలనీకి చెందిన చిన్నారులు పానీపూరితిని అస్వస్థత కు గురికాగా జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోరుకుంటున్నారు. బాధితులకు వైద్యం అందుతున్న తీరును జిల్లా వైద్యాధికారిణి ఏంజెలా ఆల్ఫ్రెడ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కాగా, పానీ పూరి విక్రత మోహన్ లాల్ పై సెక్షన్ 56 కింద కేసు నమోదు చేసినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష తెలిపారు.

పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**బాల కార్మికుని రక్షించిన పోలీసులు**

ఆసిఫాబాద్ జిల్లాలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ప్రత్యేక మాస్ రెస్క్యూ ఆపరేషన్ లో భాగంగా ఆటో బాడీ వెల్డింగ్ మిషన్ దుకాణంలో ఒక బాల కార్మికుని గుర్తించారు . ఈ బాల కార్మికు డిని పునరావాస కేంద్రానికి పంపించి తల్లిదండ్రులను పిలిపించి వారికి కౌన్సిలింగ్ అందించినట్లు ఎస్పీ నితిక పంత్ తెలిపారు.

పీటీసీ, ఆసిఫాబాద్

**పరిశీలన**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముంపు ముప్పున్న ప్రాంతాల్లో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం పర్యటించింది. వరద ముప్పునకు గల కారణాలను పరిశీలించారు. అక్కడికక్కడే పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. గత వర్షాకాలంలో వరద ముంచెత్తిన ప్రాంతాలలో నేడున్న పరిస్థితులను గమనించారు. ఇంకా అక్కడ ఏం చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేశారు. డీజీపీ సీవీ ఆనంద్ , హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి , హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్యతో పాటు.. హైడ్రా , మున్సిపల్, ఇరిగేషన్, పోలీసు శాఖలకు చెందిన అధికారులు ఈ పర్యటనలో ఉన్నారు.

డెస్క్